క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

తుంగతుర్తి : తుంగతుర్తి మండల పరిషత్ కార్యాలయంలో నేడు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ గుండగాని కవితరాములుగౌడ్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఆమె విలేకరుతో మాట్లాడారు. సర్వసభ్య సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీలు, ఆయా శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

అల్పాహారం అందజేత


అల్పాహారం వడ్డిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

భానుపురి : పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని జిల్లా బీఆర్ఎస్ నాయకుడు గండూరి కృపాకర్ అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ హాస్పిటల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అల్పాహార పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మూడు వందల రోజులుగా ఎంతో వ్యయ ప్రయాసాలతో అల్పాహార కార్యక్రమం నిర్వహిస్తున్నమని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కోశాధికారి రాచకొండ శ్రీనివాస్, శ్రీ అయ్యప్పస్వామి దేవాలయం ప్రధాన కార్యదర్శి పైడిమరి కేశవులు, నామ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికపై హర్షం

అర్వపల్లి : సంచార జాతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వెన్నెల నాగరాజు ఎన్నిక కావడంపై తెలంగాణ సాంస్కృతిక సారధి జిల్లా టీం లీడర్ మేడిపల్లి వేణు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. నాగరాజు గత పదేళ్లుగా సంచార జాతుల అభ్యున్నతి కోసం రాష్ట్ర వ్యాప్తంగా అనేక కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. ఈ సందర్భంగా నాగరాజును అభినందించారు.

బహిరంగ లేఖ ఆవిష్కరణ


బహిరంగ లేఖ చూపుతున్న నాయకులు

తిరుమలగిరి : తిరుమలగిరిలో ఈ నెల 29న జరిగే ప్రగతి నివేదన సభకు రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి కేటీఆర్ వస్తున్నందున భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య మంగళవారం వివిధ డిమాండ్లతో కూడిన బహిరంగ లేఖను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తుంగతుర్తి నియోజకవర్గంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఏ ఒక్కరికి ఇవ్వలేదని అన్నారు. తిరుమలగిరి, మోత్కూరు మున్సిపాలిటీలకు రూ.20 కోట్లు ప్రకటించి నాలుగు సంవత్సరాలైనా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని తెలిపారు. తిరుమలగిరి, నూతనకల్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయలేదని అన్నారు. మోత్కూరు మండలం ధర్మారం వరకు నిర్మించతలపెట్టిన బునాదిగాని కాల్వ ఇంకా మరమ్మతులకు నోచుకోలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వై.ధీన్‌దయాళ్, ఎం.యాదగిరి, వెంకటేశ్వర్లు, సోమయ్య, వెంకట్‌రెడ్డి, అశోక్, సోమిరెడ్డి, నరేష్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

ఆత్మకూర్ (ఎస్) : విద్యుదాఘాతానికి గురై గేదె మృతిచెందిన సంఘటన సోమవారం రాత్రి తుమ్మలపెన్‌పహాడ్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. గ్రామంలోని అలుగుబెల్లి వెంకట్‌రెడ్డికి చెందిన గేదెను రోజు మాదిరిగానే మేతకు వదిలారు. సాయంత్రం గేదె ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో దారిలో తెగిపడిన విద్యుత్ తీగలకు తగిలింది. ఈ గేదె ఒకట్రెండు రోజుల్లో ఈననుండగా ఇంతలోనే విద్యుదాఘాతానికి గురైంది. ఈ ప్రమాదంలో గేదెతో పాటు కడుపులో ఉన్న దూడ సైతం బయటికి వచ్చి మృతిచెందడంతో రైతు వెంకట్‌రెడ్డి తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. గేదె విలువ సుమారు రూ.70వేల వరకు ఉంటుందని తెలిపాడు. గాలి దుమారానికి తెగిపడిన విద్యుత్ వైర్లను సరిచేయాలని ఎన్నిసార్లు సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశాడు.

ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలి

మద్దిరాల : వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ తనకే ఇవ్వాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ మందుల సామేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేశానని తెలిపారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన తనకు టికెట్ ఇస్తే 70వేల మెజార్టీతో పార్టీని గెలిపిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకన్న, సుధాకర్, ఉప్పలయ్య, నరేష్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మందుల సామేల్

రోడ్లను కమ్మేస్తున్న కంపచెట్లు


పసునూర్ మోడల్‌స్కూల్ నుంచి పస్తాలకు వెళ్లే దారిలో పెరిగిన కంపచెట్లు


నాగారం-తుంగతుర్తి ప్రధాన రహదారిపై పసునూర్ వద్ద పెరిగిన కంపచెట్లు

- మూలమలుపుల వద్ద ప్రమాదకరంగా..
- కంపచెట్లను తొలగించాలని కోరుతున్న ప్రయాణికులు

నాగారం : నాగారం-తుంగతుర్తి ప్రధాన రహదారిపై, మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే ఆర్ అండ్‌బీ రోడ్లకు ఇరువైపులా కంపచెట్ల పెరిగి ప్రమాదకంగా మారాయి. మూల మలుపుల వద్ద కంపచెట్లు అల్లుకొని దారులు మూసేస్తుండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించక ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పసునూర్, పస్తాల, మామిడిపల్లి, మాచిరెడ్డిపల్లి, ఫణిగిరి తదితర గ్రామాలకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్ల వెంట కంపచెట్లు రోడ్లకు ఇరువైపులా అల్లుకొని ఉండటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కంపచెట్లు పెరిగి ఎదురుగా ఉన్న దారి కన్పించని పరిస్థితి ఉంది. పసునూర్-పస్తాల మధ్య ఉన్న ఆర్ అండ్‌బీ ప్రధాన రహదారికి ఇరువైపులా కంపచెట్లు రోడ్డును కమ్మేస్తున్నాయి. పసునూర్-పస్తాల మధ్య మెటల్‌రోడ్డు దారిగుండా మోడల్‌స్కూల్ విద్యార్థులు, రైతులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ దారిలో కంపచెట్లు విపరీతంగా ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు.

కనిపించని సూచిక బోర్డు..

మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే దారుల్లో ఎక్కడ కూడా సూచిక, హెచ్చరిక బోర్డులు లేకపోవడం గమనార్హం. దీంతో ఎక్కడ మూలమలుపు ఉందో తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్లకు ఇరువైపులా ప్రమాదకంగా ఉన్న కంపచెట్లను తొలగించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

కంపచెట్లను తొలగించాలి



పస్తాల, పసునూర్ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా సర్కార్ చెట్లు అల్లుకొని ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పసునూర్ నుంచి పస్తాలకు సుమారు 150 మంది విద్యార్థులు కంపదారి నుంచే నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. పెరిగిన కంపచెట్లతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్ల వెంట ఉన్న కంపచెట్లను తొలగించాలి.

– బొజ్జ సైదులు, పస్తాల

విద్యుత్ సరఫరా చేయాలని ధర్నా


తిరుమలగిరి సబ్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న తొండ రైతులు

తిరుమలగిరి : తొండ గ్రామంలో పది రోజులుగా విద్యుత్ సరఫరా జరుగకపోవడంతో మంచినీళ్లకు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని, నారుమళ్ల ఎండి పోతున్నాయని గ్రామస్తులు, రైతులు తిరుమలగిరిలోని సబ్‌స్టేషన్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. లైన్‌మెన్ వద్ద తాత్కాలిక ఉద్యోగిగా పని చేస్తున్న కొల్లూరి మహేష్ ఈ నెల 22న విద్యుత్ సరఫరా చేస్తూ విద్యుదాఘాతానికి గురై కింద పడగా.. ఆ రోజు నుంచి గ్రామంలో విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా మారిందని తెలిపారు. అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని అన్నారు. తాత్కాలిక ఉద్యోగి కొల్లూరి మహేష్‌కు నష్టపరిహారం అందించాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చింతకింది యాదగిరి, కె.నాగరాజు, బంగారి, లింగయ్య, వెంకన్న, కిషన్, సోమయ్య, వేల్పుల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రుణమాఫీ హామీ నెరవేర్చాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నూతనకల్ : సీఎం కేసీఆర్ రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీని అమలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కందాల శంకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం రైతుసంఘం ఆధ్వర్యంలో తహసీలార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ఎండీ జమీరుద్దీన్‌కు అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు కూసు సైదులు, గజ్జల శ్రీనివాస్‌రెడ్డి, తొట్ల అచ్చయ్య, హరీష్, సామ వెంకట్‌రెడ్డి, ప్రవీణ్, బాలకృష్ణ, మందడి చంద్రారెడ్డి, కొడకండ్ల రాంరెడ్డి, కొల్లు జనార్దన్‌రెడ్డి, ఉప్పుల పరమేష్, బాణాల మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం


పథకాలపై ప్రచారం చేస్తున్న సంకినేని

చివ్వెంల : కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాత్రి మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. ఆయుష్మాన్ భారత్, సుకన్య సమృద్ధి యోజన, పీఎం శ్రీయోజన్, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, వంటి పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పేరాల లక్ష్మణ్‌రావు, ప్రధాన కార్యదర్శి జంపాల వెంకటేశ్వర్లు, ధరావతు శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛను కాలరాస్తున్న ప్రభుత్వాలు


మాట్లాడుతున్న నాయకపు పరమేష్

నూతనకల్ : భావ ప్రకటన స్వేచ్ఛ, జీవించే హక్కును ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని సమాచార హక్కు చట్టం మండల అధ్యక్షుడు నాయకపు పరమేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిరంతరం ప్రజల పక్షం ఉండి ప్రశ్నిస్తున్న జర్నలిస్టులపై, సమాచార హక్కు చట్టం కార్యకర్తలపై దాడి చేయడం, అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురి చేయడం ప్రభుత్వాల నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. బెల్టు షాపుల వివరాలను సమాచార హక్కు చట్టం ద్వారా ప్రశ్నిస్తే అసలు బెల్టు షాపులే లేవని ఎక్సైజ్ అధికారులు సమాధానం ఇవ్వడం సరైంది కాదన్నారు. పాఠశాలలు పునఃప్రారంభమైనా ఇంతవరకు పారిశుద్ధ్య కార్మికులను నియమించకపోవడం, వంట ఏజెన్సీలకు బకాయిలు చెల్లించకపోవడం శోచనీయమన్నారు. మానవ హక్కులను మంట కలిపే ఇలాంటి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రభుత్వాలు మానుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం సభ్యులు మహేష్, భద్రు, సైదులు, నాగార్జున, వెంకటేశ్వర్లు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం చెల్లించాలని వినతి


అధికారితో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

అర్వపల్లి : ఇటీవల కురిసిన అకాల, వడగళ్ల వర్షాలకు మండల వ్యాప్తంగా పంటనష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపాక సాయిబాబా డిమాండ్ చేశారు. మంగళవారం అర్వపల్లిలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ యాదగిరిరెడ్డికి బీజేపీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున నష్టపరిహారం చెల్లిస్తామని స్వయంగా సీఎం కేసీఆర్ ప్రకటించినా ఇంతవరకు అమలుకాలేదని చెప్పారు. మళ్లీ వానాకాలం సీజన్ మొదలైనందున రైతులకు వ్యవసాయ ఖర్చుల కోసం నష్టపరిహారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల కోశాధికారి వేముల సత్తయ్య, చవ్వ సురేష్, జిన్నె అశ్విన్, మంచాల నవీన్, శ్రీశైలం పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి


ప్రచారం చేస్తున్న కౌన్సిలర్ గిలకత్తుల ప్రియలత

తిరుమలగిరి : తిరుమలగిరిలో ఈ నెల 29న జరిగే తుంగతుర్తి నియోజకవర్గ ప్రగతి నివేదన సభను విజయవంతం చేయాలని తిరుమలగిరిలోని 15వ వార్డు కౌన్సిలర్ గిలకత్తుల ప్రియలతారాము గౌడ్ కోరారు. మంగళవారం వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు బొట్టు పెట్టి బహిరంగ సభకు హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు క్విజ్ పోటీలు


పెన్‌పహాడ్ : విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎంఈఓ, ఎస్‌బీఐ మేనేజర్


తిరుమలగిరి : గుండెపురిలో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు


అర్వపల్లి : విద్యార్థులకు ప్రశంసాపత్రం అందిస్తున్న నోడల్ అధికారి, హెచ్‌ఎంలు


మద్దిరాల : విద్యార్థులకు ప్రశంసాపత్రాన్ని అంద జేస్తున్న అధికారులు

పెన్‌పహాడ్ : విద్యార్థులు బ్యాంకింగ్ రంగం పట్ల అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓ నకిరేకంటి రవి, ఎస్‌బీఐ గడ్డిపల్లి మేనేజర్ సుకుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లింగాల విద్యార్థులు ప్రథమ బహుమతి రూ.5000లు, అనాజిపురం ఆదర్శ పాఠశాల విద్యార్థులు ద్వితీయ బహుమతి రూ.4000లు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెన్‌పహాడ్ విద్యార్థులు తృతీయ బహుమతి రూ.3000లు గెలుపొందారు. ఈ నగదును బ్యాంక్ అంకౌట్లో జమ చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మైలారపు వెంకన్న, గుండా వెంకటేశ్వర్లు, వెన్న మధుసూదన్‌రెడ్డి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో ప్రథమ బహుమతి

తిరుమలగిరి : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో తిరుమలగిరి, తుంగతుర్తి మండలాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తుంగతుర్తిలో నిర్వహించిన ఫైనాన్షియల్ లిటరసీ క్విజ్ పోటీల్లో గుండెపురి పాఠశాలకు చెందిన పాలకుర్తి మౌనిక, గుండెబోయిన శివమౌనికలు ప్రథమ స్థానం పొంది జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.సోమయ్య తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామారావు, లక్ష్మణ్, మహేష్, స్వరూప, రవి, ఆనంద్‌భాస్కర్ పాల్గొన్నారు.

ఆర్థికంగా ఎదగాలంటే పొదుపు పాటించాలి

అర్వపల్లి : పిల్లలు ఆర్థికంగా ఎదగాలంటే చిన్న నాటి నుంచే పొదుపు పాటించాలని జాజిరెడ్డిగూడెం ఎస్‌బీఐ మేనేజర్, నోడల్ అధికారి బి. రామకృష్ణ అన్నారు. జాజిరెడ్డిగూడెం ఎస్‌బీఐ సిబ్బంది మంగళవారం అర్వపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో జాజిరెడ్డిగూడెం, నాగారం మండలాల హైస్కూల్ విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అర్వపల్లి జెడ్పీహెచ్‌ఎస్ ప్రథమ, కొమ్మాల జెడ్పీహెచ్‌ఎస్ ద్వితీయ, జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు తృతీయ బహుమతులు గెల్చుకున్నారు. వీరికి బ్యాంక్ సిబ్బంది నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. అలాగే ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి రూ. 250 చొప్పున నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం, సెంటర్ ఇన్‌చార్జ్ జెల్లా ప్రసాద్, గైడ్‌లు బి. రామచంద్రయ్య, గోపాల్, ఎన్.దుర్గయ్య, లక్ష్మయ్య, ప్రేమయ్య తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ కాంపిటీషన్‌లో ప్రథమ బహుమతి

మద్దిరాల : నూతనకల్లు మండల కేంద్రంలో ఆర్‌బీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ కాంపిటీషన్‌లో మద్దిరాల మండల పరిధిలోని రెడ్డిగూడెం గ్రామానికి చెందిన 10వ తరగతి విద్యార్థిని బర్పటి అకింత ప్రథమ బహుమతి సాధించింది. రెడ్డిగూడెం గ్రామానికి చెందిన బర్పటి శశికుమార్‌కు ద్వితీయ బహుమతి పొందారు. ఆర్‌బీఐ అధికారులు వారిని అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఐ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేత


తుంగతుర్తి : జెడ్పీహెచ్‌ఎస్‌లో నోట్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ లింగయ్య


మద్దిరాల : నోట్ పుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ రాములు నాయక్

తుంగతుర్తి : ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న నోట్ బుక్స్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ బోయిని లింగయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చిన నోట్ పుస్తకాలను పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. అనంతరం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నోట్ పుస్తకాలను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కొండగడ్డుల యాకయ్య, ఎస్ఎంసీ చైర్మన్ నాగరాజు, భాస్కర్, శ్రీనివాస్, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : నూతనకల్లులోని ఎమ్మార్సీలో మద్దిరాల మండలం ప్రధానోపాధ్యాయుడు నర్సింహాచారికి ఎంఈఓ రాములునాయక్ మంగళవారం నోట్ పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు నవీన్, ఉపేందర్, మల్లయ్య పాల్గొన్నారు.

అందుబాటులో వరి విత్తనాలు

అర్వపల్లి : అర్వపల్లిలోని పీఏసీఎస్‌లో వివిధ రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్ రెడ్డి, సీఈఓ మేడబోయిన రామస్వామి తెలిపారు. బీపీటీ, ఎంటీయూ–1010, కేఎన్ఎం118 రకాల వరి విత్తనాలు ఉన్నాయని చెప్పారు. బీపీటీ 25కిలోలు రూ. 888, ఎంటీయూ 1010 రకం 25కిలోలు రూ. 883, కేఎన్ఎం118 రకం 25కిలోలు రూ. 883 ధర ఉంటుందని పేర్కొన్నారు. కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ ప్రతులను తీసుకొని రావాలని సూచించారు.

టీడీపీ భువనగిరి పార్లమెంట్ కార్యదర్శిగా పులుసు శేఖర్



నాగారం : తెలుగుదేశం పార్టీ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ కార్యదర్శిగా నాగారం మండలం పస్తాల గ్రామానికి చెందిన పులుసు శేఖర్‌గౌడ్ మంగళవారం నియమితులయ్యారు. ఈ మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం పులుసు శేఖర్ గౌడ్ మాట్లాడుతూ టీడీపీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. తన ఎన్నికకు సహకరించిన భువనగిరి పార్లమెంట్ అధ్యక్షుడు కుందారపు కృష్ణమాచారి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్యయాదవ్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆకారపు రమేష్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సత్ఫలితాలిచ్చిన ‘స్వచ్ఛ భారత్’

- పల్లెల్లో ప్రతి ఇంట పూర్తయిన మరుగుదొడ్ల నిర్మాణం

అర్వపల్లి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల ద్వారా ఇంటింటా మరుగుదొడ్లను నిర్మిస్తూ బహిరంగ మలవిసర్జన రహిత(ఓడీఎఫ్) గ్రామాలుగా ప్రతి పల్లెను తీర్చిదిద్దుతున్నాయి. గతంలో మరుగుదొడ్ల నిర్మాణం కోసం పెట్టిన కొన్ని పథకాలు పూర్తిగా సక్సెస్ కాలేదు. అయితే 2018 నుంచి స్వచ్ఛభారత్ సర్వేక్షణ్‌ను కేంద్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని అమలుపరిచింది. ప్రతి ఇంటా మరుగుదొడ్డి ఉండాలనే లక్ష్యంతో ఉపాధిహామీ పథకం ద్వారా నిధులను మంజూరు చేసింది. అన్ని గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణ పనులను ప్రారంభించింది.

జాజిరెడ్డిగూడెం మండలంలో ఇలా..

జాజిరెడ్డిగూడెం మండలంలో 17 గ్రామ పంచాయతీలున్నాయి. మొదటి దశలో అడివెంల, అర్వపల్లి, కోడూరు, కొమ్మాల, తిమ్మాపురం గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేసి ఓడీఎఫ్‌గా ప్రకటించారు. మిగిలిన 12 గ్రామ పంచాయతీలు పర్సాయపల్లి, నాన్యతండా, లోయపల్లి, కుంచమర్తి, కోమటిపల్లి, కాసర్లపహాడ్, జాజిరెడ్డిగూడెం, బొల్లంపల్లి, వేల్పుచెర్ల, సూర్యనాయక్‌తండా, రామన్నగూడెం గ్రామాల్లో రెండవదశలో ఇంటింటికీ మరుగుదొడ్డిని నిర్మించారు. రెండోవిడత నందు స్వచ్ఛభారత్‌సర్వేక్షణ్ ద్వారా సుమారు రూ.26 కోట్లతో 2,225 మరుగుదొడ్ల నిర్మాణం చేయించారు. దీంతో మండలంలోని అన్ని గ్రామాలు బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా మారాయి.


అర్వపల్లిలోని ఓ ఇంటిలో నిర్మించిన మరుగుదొడ్డి

అవగాహన కల్పించాం



కొత్తగా గ్రామ పంచాయతీగా ఏర్పడిన అర్వపల్లిలో ప్రతి ఇంటా మరుగుదొడ్డి నిర్మించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాం. గ్రామంలోని సుమారు 600 కుటుంబాలకు గాను అంతా మరుగుదొడ్లు నిర్మించుకోవడం జరిగింది.

– బైరబోయిన సునీతారామలింగయ్య, సర్పంచ్, అర్వపల్లి

ఓడీఎఫ్‌గా మారింది



మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికీ మరుగుదొడ్లు నిర్మించుకోవడంతో అధికారులు ఓడీఎఫ్‌గా ప్రకటించారు. ఇంటింటికీ మరుగుదొడ్డి నిర్మించుకోవడం సంతోషంగా ఉంది. వీటి నిర్మాణంతో గ్రామాల్లో ప్రజలు అనారోగ్య సమస్యలకు దూరంగా ఉంటారు.

– ఉపేందర్‌రావు, ఎంపీఓ

రూ.26 కోట్లు ఖర్చయ్యాయి



స్వచ్ఛభారత్ సర్వేక్షణ్‌లో ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మాణం కోసం ఉపాధి హామీ, తదితర పథకాల ద్వారా మండల వ్యాప్తంగా సుమారు రూ.26 కోట్ల వరకు ఖర్చయ్యాయి. జాజిరెడ్డిగూడెం మండలం బహిరంగ మలవిసర్జన రహిత మండలంగా మారింది.

– కతురోజు ఉమేష్, ఎంపీడీఓ

విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలి

తిరుమలగిరి: ఇటీవల కురిసిన వర్షాలకు మాలిపురం గ్రామ శివారులో విద్యుత్ స్తంభం విరిగిపడి నాలుగు రోజులు అవుతున్నా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామానికి చెందిన రైతులు మూల యాదగిరి, మూల లక్ష్మయ్య, మూల వీరయ్య, మూల వెంకన్నలు తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ పనులు ప్రారంభమవుతున్నందున విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని కోరారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం


మృతురాలు పాల్వాయి రేణుక చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏపూరి సోమన్న

నాగారం : నాగారం మండల కేంద్రానికి చెందిన పాల్వాయి రేణుక ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ సందర్భంగా వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, తుంగతుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఏపూరి సోమన్న మంగళవారం మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5,000 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ నాయకులు దున్నపోతుల చంద్రశేఖర్, చింతకుంట్ల పరమేష్, ఏపూరి యాకన్న, మందుల రాము, దిలీప్, రిషీ, పేరాల దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

సూర్యాపేటటౌన్ : ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు విక్రయిస్తూ విద్యను వ్యాపారం చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ(విజృంభణ) రాష్ట్ర సహాయ కార్యదర్శి బెల్లి నాగరాజు డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని మంగళవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట పీడీఎస్‌యూ(విజృంభణ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి మాట్లాడారు. అధిక ఫీజులు చెల్లించలేక విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పల్లెబోయిన జాని, పవన్, మల్లేష్, అవిలయ్య, నవీన్ పాల్గొన్నారు.

తిరుమలగిరిలో హనుమాన్ భక్తుల ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న హనుమాన్ భక్తులు

తిరుమలగిరి : హనుమాన్ చాలీసా పారాయణం చేపట్టి సంవత్సరం పూర్తయినందున తిరుమలగిరిలో హనుమాన్ భక్తులు మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సాయిబాబా ఆలయంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సుధాకర్, వెంకటేశ్వర్లు, రమేష్, రాములు, గోవర్దన్, సత్యనారాయణ, యాదగిరి, శేఖర్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

కోదాడఅర్బన్ : తెలంగాణ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వి.సజ్జనార్ ఆదేశాల మేరకు మంగళవారం కోదాడ ఆర్టీసీ డిపోలో రెడ్ క్రాస్ సూర్యాపేట వారి సహకారంతో ఇన్‌చార్జ్ డిపో మేనేజర్ సురేందర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ బి.సైదులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాజిరెడ్డిగూడెం ఎస్‌బీఐ మేనేజర్‌గా రామకృష్ణ

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) మేనేజర్‌గా బదావత్ రామకృష్ణ నియమితులయ్యారు. ఈయన ఖమ్మం నుంచి ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న వెంకటరవి తిరుమలగిరి బ్రాంచ్‌కి బదిలీ అయ్యారు.